
www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 15 నవంబర్ 2024

5

తిరుపతి



బాలల దినోత్సవం రోజున...


జ్వరంతో బాధపడుతున్న విద్యార్థిని రుయాలో పరామర్శిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రవి


దుర్గంధభరితంగా మరుగుదొడ్లు

గురువారం బాలల దినోత్సవం... జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సంబరాలు చేసుకుంటున్నారు.. అయితే సత్యవేడు నియోజకవర్గ కేంద్రం జ్యోతిరావుపూలే బిసి బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు 40 మంది చలి జ్వరంతో వణుకుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.. అంతమందికి ఒకేసారి జ్వరం ఎందుకొచ్చిందని కలెక్టర్, డిఎంహెచ్‌ఒ స్వయంగా వెళ్లి ఆరా తీయగా, వారు ఉండే గురుకుల పాఠశాల ప్రాంగణంలో పరిసరాలు భయంకరంగా ఉన్నాయి. మరుగుదొడ్లు అయితే దుర్గంధభరితం.. ఈ కారణంగానే దోమలు కుట్టి జ్వరాలు వచ్చాయని విద్యార్థులు చెబుతున్నారు. అయితే ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్లే ఇంతమంది విద్యార్థులు ఒకేసారి జ్వరాల బారిన పడ్డారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి మండిపడ్డారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి, బిసి బాలుర గురుకుల పాఠశాలలో వసతులు మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. ఇది మన బాలల చదువుల తీరు.

వాగ్దానాలు మరచి.. భారాలు మోపడంపై...

సిపిఎం ప్రజాపోరు

జిల్లావ్యాప్తంగా ధర్నాల హోరు



తిరుపతి కలెక్టరేట్ వద్ద



సూళ్లూరుపేటలో...

ప్రజాశక్తి- యంత్రాంగం

టిడిపి కూటమి సూపర్‌సిక్స్ వాగ్దానాలను మరచి, భారాలను మోపడాన్ని నిరసిస్తూ సిపిఎం 'ప్రజాపోరు' నిర్వహించింది. వారం రోజుల పాటు కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తూ, వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తూ టిడిపి కూటమి వైఫల్యాలను ఎండగట్టింది. గురువారం జిల్లావ్యాప్తంగా సిపిఎం శ్రేణులు ప్రజా సమస్యలపై మండల కార్యాలయాల వద్ద గళమెత్తారు.

సూళ్లూరుపేటలో... సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు నాయకత్వం వహించారు. ఆర్డీవో కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహించారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ఉద్యోగాలు కల్పించాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, జమిలి ఎన్నికలు రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, నిత్యావసర వస్తువుల ధరలు అరికట్టాలని నినదించారు. అనంతరం ఆర్‌డిఓకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో నాయకులు చంద్రశేఖర్, సుంకర అల్లెయ్య, కె.లక్ష్మయ్య, బి.పద్మనాభయ్య, మునెయ్య, వెంకటేశ్వర్లు, బత్తెయ్య, ఎస్.సాంబశివయ్య, బాలగురవయ్య పాల్గొన్నారు.

తిరుపతి (మంగళం)లో.. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, నిత్యవసర సరుకుల ధరలను సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి అన్నారు. గురువారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ నవంబర్ 8 నుండి 15వ తేదీ వరకు ప్రజా సమస్యల పరిష్కారానికై సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా పోరుకు పిలుపునిచ్చామన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంపుకై గతంలో రూ.6 వేల కోట్ల ప్రతిపాదనలకు అనుమతి లభించిందని, ఇప్పుడు మళ్లీ రూ 11 వేల కోట్ల రూపాయలు ప్రజల నుండి వసూలు చేయడానికి కుట్రలు చేస్తున్నారన్నారు. నగర కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రంలో సమస్యలను పక్కదారి పట్టించడానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం అని ఒక నినాదాన్ని తీసుకొని సామాన్య ప్రజల గొంతుకను బాహ్య ప్రపంచానికి వినపడకుండా చేశారన్నారు. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను కలిసి ప్రజా సమస్యలపై వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, లక్ష్మీ, తిరుపతి పట్టణ సిఐటియు కార్యదర్శి వేణుగోపాల్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, హరినాథ్, సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యురాలు బుజ్జి, రాధా తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో.. ఎన్నికల హామీల అమల్లో కూటమి సర్కారు విఫలమైందని సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 8వ తేదీన ప్రారంభమైన 'ప్రజాపోరు' ముగింపు ధర్నా గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగింది. గంధం మణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు మిన్నంటాయని వాపోయారు. ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు పెనగడం గురవయ్య, కుమార్, సంక్రాంతి వెంకటయ్య, వేణు, రాధమ్మ, గురునాధం, అన్వర్ బాషా, రాజా, గురవయ్య, ప్రసాద్, సుబ్రమణ్యం, వెలివేంద్రం తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో... ఎంఆర్‌ఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎ.రాజేంద్రకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు శివకవి ముకుంద, ఎస్.మహేష్‌బాబు మాట్లాడుతూ ట్రూఅప్ ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలు మోపడమే కాకుండా, ఇళ్లకు స్మార్ట్ మీటర్లను పెట్టి ప్రజల వద్ద డబ్బు గుంజుతున్నారన్నారు. పుట్టయ్య, ఎన్.ముకుంద, రమణయ్య పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో... సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఇసుక అందరికీ అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఒకటో పట్టణం నుంచి రెండో పట్టణానికి కలుపుతూ వేస్తున్న ఫైఓవర్ బ్రిడ్జి గత కొన్నేళ్లుగా నిర్మాణ లోపంతో మధ్యలో ఆగిపోయిందన్నారు. ప్రభుత్వాలు మారడం వల్ల నత్తనడకన నడుస్తోందన్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యతో జనం అల్లాడుతున్నారన్నారు. అంబేద్కర్ భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఆర్‌డిఒ స్పందిస్తూ నూతన అంబేద్కర్ భవనానికి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని, త్వరలోనే నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. నాయకులు జోగి శివకుమార్, టి.వెంకటరామిరెడ్డి, బివి రమణయ్య, ఎస్.సురేష్, ముత్యాలయ్య, పామంజి మణి, ఎ.ప్రసాద్, ఎ.చంద్రమోహన్, బి.చంద్రయ్య, నారాయణ, వెంకటయ్య, పుట్టా శంకరయ్య పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగలో... తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, మండల కార్యదర్శి ఎన్.రమణయ్య ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. దళితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. తహశీల్దార్ సుబ్రమణ్యంకు వినతిపత్రం సమర్పించారు. కుంభాకంలోని సర్వే నంబర్ 81లోని 22 ఎకరాల 80 సెంట్లు భూమిని గ్రామంలోని 40 కుటుంబాల వారికి పట్టాలివ్వాలని, గాజులపల్లి రెవెన్యూలోని గొర్రిపూడి అడవి 42వ సర్వే నంబర్ భూమిని ఎస్‌టిలకు రెండు ఎకరాల చొప్పున ఇవ్వాలని డిమాండ్‌చేశారు. తిరుపాలయ్య, వెంకటపతి రాఘవయ్య, వెంకటరమణయ్య, జికె రమణయ్య, సుబ్బయ్య పాల్గొన్నారు.

కెవిబిపురంలో.. మండల కార్యాలయం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, వరలక్ష్మి, లక్ష్మయ్య, శంకరయ్య, వెంకటేష్, బుజ్జమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

నారాయణవనంలో... మండల కార్యదర్శి మునిశంకర్, సిపిఎం జిల్లా నాయకులు వెంకటేష్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. దళిత గిరిజనుల అనుభవంలో ఉన్న సాగు భూములకు, నివాస స్థలాలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమి పశువుల మేత తుంబురు లెక్క దాఖలాలో ఉన్న నైనరు కండ్రిక పంచాయతీ కష్టం రాజుల కండ్రిగ పశువుల మేత సర్వే నెంబర్ 123 రెండు ఎకరాలను బీడు భూమి పట్టాని రద్దు చేస్తూ గ్రామానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. నాయకులు శివయ్య, యేసయ్య, దయ నాగరాజు, బసవయ్య, సురేష్, చెంచయ్య పాల్గొన్నారు.

సత్యవేడులో... కార్యదర్శి మెలుగు రమేష్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దళిత గిరిజన వాడలకు తాగునీరు, సిమెంట్ రోడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు కిష్టయ్య, మునస్వామి, లక్ష్మమ్మ, కాంతమ్మ, శాంతమ్మ, పోలయ్య, రమేష్, లక్ష్మయ్య, ముత్తు, వరాలు, శాంతి, రాధ పాల్గొన్నారు.

ఏర్పేడులో... సిపిఎం నాయకులు రంగయ్య, కరీముల్లా, రాంబాబు, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. పాపానాయుడుపేట - రేణిగుంట మధ్యలో రోడ్డు విస్తరణ నిర్మాణం చేపట్టాలని, ఇందిరమ్మ కాలనీలో కాపురం ఉన్న కాలనీవాసులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేసి, ఇఎస్ఐ, పిఎఫ్ కల్పించాలని డిమాండ్ చేశారు.

పుత్తూరు టౌన్‌లో... విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం జిల్లా నాయకులు వెంకటేష్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పుత్తూరు పట్టణంలోని జ్యోతిబసనగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని స్మశాన సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు మునిశంకర్, నరసింహులు, గోవింద్‌రెడ్డి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.


నాయుడుపేటలో...

బిసి బాలుర గురుకుల పాఠశాలలో 40 మంది..

జ్వర పీడితులు

పరామర్శించిన కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్


పరామర్శిస్తున్న కలెక్టర్, డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - సత్యవేడు

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గ కేంద్రం జ్యోతిరావు పూలే బిసి బాలుర గురుకుల పాఠశాలలో 40 మంది విద్యార్థులు తీవ్ర జ్వరంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు రోజులుగా విద్యార్థులు జ్వరంతో ఇబ్బంది పడుతున్నా సిబ్బంది నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలున్నాయి. అపరిశుభ్రమైన పరిసరాలు, మరుగుదొడ్ల దుర్గంధం జ్వరాలకు కారణమని విద్యార్థులు వాపోతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులను కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డిఎంహెచ్‌ఒ శ్రీహరి గురువారం పరామర్శించారు. వివరాలిలా ఉన్నాయి.

జ్యోతిరావు పూలే బాలుర బిసి గురుకుల పాఠశాలలో 40 మంది విద్యార్థులు జ్వరాలతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. రెండు రోజులుగా జ్వరాలతో ఇబ్బంది పడుతున్నా ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, స్టాఫ్ నర్సులు నిర్లక్ష్యం వహించారని తెలుస్తోంది. గురువారం సాయంత్రం ముగ్గురు విద్యార్థులు తీవ్ర అస్వస్థతతో ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ సురేష్‌కుమార్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులను విచారించారు. జ్వరంతో ఇబ్బంది పడుతున్న పిల్లలను ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. తీవ్ర జ్వరంతో ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక చికిత్స అందించారు. ఆరో తరగతి చదువుతున్న శివకుమార్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్ వైద్యశాలను సందర్శించి విద్యార్థులను పరామర్శించారు.


సంఘటనపై ఆరా తీసిన కలెక్టర్

పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, స్టాఫ్ నర్సు, వైద్యాధికారులతో కలెక్టర్ సంఘటనపై ఆరా తీశారు. జరిగిన ఘటనకు ప్రిన్సిపాల్, స్టాఫ్ నర్సు కారణమని, వారి నిర్లక్ష్యం వల్లే పిల్లలు ఇబ్బంది పడ్డారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని వీడియో ద్వారా గుర్తించి, వెంటనే వాటిని శుభ్రపరచి, పునర్నిర్మాణానికి ప్రణాళిక చేయాలని డిడిని ఆదేశించారు. ఇటువంటి ఘటన మరోసారి పునరావృతం కాకుండా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

మరుగుదొడ్ల అపరిశుభ్రతపై మండిపడ్డ డిఎంహెచ్‌ఒ

ఘటనపై స్పందించి డిఎంహెచ్‌ఒ శ్రీహరి సంబంధిత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని 60 మరుగుదొడ్లను పరిశీలించగా దుర్వాసనతో అపరివుభ్రంగా ఉండటాన్ని చూసి చలించిపోయారు. వెంటనే వీటిని శుభ్రపరచాలని ఎంపిడిఒను ఆదేశించారు. ప్రస్తుతం పాఠశాలలో వైద్య బృందం పిల్లలందరినీ పరీక్షించి, రెండు రోజుల పాటు హెల్త్ క్యాంపు నిర్వహించనుంది. సత్యవేడు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులు 35 మంది ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు డాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు.

ఎంఎల్ఎ ఆదిమూలం ఫోన్‌లో ఆరా



జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిఎంహెచ్‌ఒ శ్రీహరిని ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం ఫోన్‌లో ఆరా తీశారు. అసెంబ్లీ నుంచి వచ్చిన తరువాత శుక్రవారం విద్యార్థులను పరామర్శిస్తానని చెప్పారు. బిసి సంక్షేమ శాఖా మంత్రి స్పందిస్తూ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.


మంచం కింద దాచి ఉంచిన ఎర్రచందనం దుంగలు

దో(దా)చారా...!

మంచం కింద ఎర్రచందనం దుంగలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా అడ్డుకోవడానికి ప్రభుత్వాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తూ ప్రత్యేక నిఘా వ్యవస్థ, టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. అయితే శేషాచలం నుండి అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలించడానికి ఇంటి దొంగల పాత్రపై గతంలో అనేకమార్లు విమర్శలు బాహ్య ప్రపంచానికి వినిపించాయి. అదేమీ లేనట్టుగా అధికారులు తేల్చి వేసేవారు. ఎర్రచందనం స్మగ్లర్ల నుండి వివిధ దాడుల్లో స్వాధీనం చేసుకున్న దుంగలకు వాటి బరువు, పొడవు వెడల్పులను రికార్డుల్లో నమోదు చేయడంతో పాటుగా స్వాధీనం చేసుకున్న దుంగలపై పెయింట్తో రాస్తారు. తిరుపతి కపిల తీర్థం వద్దగల యాంటీ పోచింగ్ స్క్వాడ్ కార్యాలయం వంటగదిలో మంచం కింద దాచి ఉంచిన ఎర్రచందనం దుంగలకు అటువంటి పెయింట్ రాతలు కనబడలేదు. అంటే అడ్డుకోవలసిన వారే అక్రమ రవాణాకు తరలించారా?, లేక దుంగలను మరో అవసరాలకు వినియోగించాలని దాచి ఉంచారా అన్న విషయాలు అధికారుల విచారణలో తెలియాల్సి ఉంది. వంట గదిలో మంచం కింద ఉన్న ఎర్రచందనం దుంగల గుట్టును జిల్లా అటవీశాఖ అధికారులు విచారించి నిగ్గు తేల్చాల్సి ఉంది. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకొని స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలను తిమ్మి నాయుడు పాలెం వద్ద ఉన్న ఎర్రచందనం కేంద్ర గోదాముకు తరలించాల్సి ఉంది. అయితే మంచం కింద ఎర్రచందనం దుంగలను ఎవరు దాచారో?. దీనిపై కార్యాలయ సంబంధిత అధికారిని వారి కార్యాలయంలో మంచం కింద దాచి ఉంచిన ఎర్రచందనం దుంగల వివరాలను కోరే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు. మంచం కింద ఉంచాల్సిన అవసరం ఏమొచ్చిందో ఏమో మరి...

స్వామీ..మందులేవి..?

స్విమ్స్‌లో మందుల కొరత

అరకిలోమీటర్ వెళ్లాల్సిందే..

మెడికల్ షాపు లేక అవస్థలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

శ్రీవారి చెంత...మూడు సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల ప్రాంగణం. ఆసుపత్రుల్లో ఇచ్చే మందులు కొందరికే. 80శాతం పైగా ప్రయివేట్ మెడికల్ షాపుల్లోనే మందులు కొనుక్కోవాల్సిన పరిస్థితి. రాయలసీమకే తలమానికమైన స్విమ్స్ ప్రాంగణంలో మెడికల్ షాపు అగుపిస్తే ఒట్టు. తూతు మంత్రంగా ఒకటంటే ఒకటే, అది కూడా లోపలెక్కడో.. అందులోనూ అరాకొరగానే మందులు...పైగా పగటిపూట నిర్దేశిత సమయంలోనే షాపు నిర్వాహణ. దీంతో అత్యవసర పరిస్థితుల్లో మందులు దొరక్క, సుమారు అరకిలోమీటర్ మేర ప్రయాణించి మందులు తెచ్చుకోలేక రోగులు, వారి సహాయకులు అవస్థలు పడుతున్నారు. రోగుల వెతలను నిత్యం చూస్తున్న టిటిడి, వైద్య అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం గమనార్హం.

తిరుపతి ఆధ్యాత్మిక కేంద్రమే కాదు. విద్యాకేంద్రం కూడా. హెల్త్ (వైద్య) హబ్‌గానూ ఎదుగుతోంది. రాష్ట్రంలోనే నెంబర్‌వన్ ఆసుపత్రిగా పేరుగడించి, టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్), దేశంలోనే ప్రత్యేక ప్రతిభావంతుల, పోలియో బాధితులు, కీళ్లమార్పిడి కోసం ఏర్పాటు చేసిన ఏకైక ఆర్థోపెడిక్ ఆసుపత్రి బర్డు, అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలో దేశ వ్యాప్తంగా సుపరిచితమైన టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీబాలాజీ చిన్నపిల్లల గుండె శస్త్రచికిత్స ఆసుపత్రి ఉన్నాయి. దేశంలో మహిళా వైద్య విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల, దానికి అనుబంధంగా ఉన్న ఎస్‌పిఎంసి ఆసుపత్రి సుముదాయల కలయిక ఆ ప్రాంతం. దీనికి తోడు పక్కనే రాయలసీమలోనే అదిపెద్ద పేదల ఆసుపత్రి రుయా, అతిపెద్ద ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల, ప్రభుత్వ రంగం ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకైక చిన్నపిల్లల ఆసుపత్రి. వీటికి తోడు శ్రీవెంకటేశ్వర ఆయుర్వేద ఆసుపత్రి కలయికతో సుమారు కొన్ని వందల ఎకరాల ప్రాంగణం మొత్తం వైద్యశాలలతో నిండి ఉంది. ఈ ఆసుపత్రులకు ప్రతిరోజూ 10వేల మందికి పైగా రోగులు ఓపి సేవల నిమిత్తం వస్తుంటారు. సుమారు 3 నుంచి 4 వేల మంది రోగులు ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతుంటారు. ఇంతటి ప్రాధాన్యత గల ఈ ప్రాంతంలో మెడికల్ షాపులు అందుబాటులో లేకపోవడం బాధాకరం. స్విమ్స్ ఆధ్వర్యంలో మూడు మెడికల్ షాపులు, బర్డుకు ఒక మెడికల్ షాపు, ఎస్‌పిఎంసికి మరో మెడికల్ షాపు ఉండేది. ఇప్పుడు వాటిని తీసేశారు. సుమారు ఆరు నెలలుగా ఒకటంటే ఒకటే మెడికల్ షాపు ఉంది. అది కూడా స్విమ్స్ ఆసుపత్రిలో డైరెక్టర్ ఛాంబర్‌కు ఆనుకుని లోపల పక్కన ఏర్పాటు చేశారు. అక్కడ ఆ షాపు ఉన్నట్లే ఎవ్వరికి తెలియకపోవడం గమనార్హం. ఆ ప్రాంతంలో కొత్త భవన నిర్మాణాలు జరుగుతుండడంతో రోగులు, వారి సహాయకులు అలా వెళ్లేందుకే సాహసించరు. పైగా పగటి పూట నిర్దేశిత సమయంలోనే ఆ షాపు తెరచి ఉంటుంది. అందులోనూ అరాకొర మందులు మాత్రమే లభిస్తుండడంతో రోగులకు ప్రత్యామ్నాయ మార్గాలు లేక అవస్థలు పడుతున్నారు. బర్డు, చిన్నపిల్లల హృదయాలయం వద్ద ఎక్కడ కూడా మెడికల్ షాపు లేకపోవడం దారుణం. అత్యవసర సమయంలో మందుల కోసం రోగులు ఎస్‌పిఎన్‌జి కార్పొరేషన్ స్కూల్ మైదానం సమీపంలోకి రావాల్సి ఉంటుంది. సుమారు అర్ధకిలోమీటరు కాలినడకనే వెళ్లాల్సిన పరిస్థితి. పైగా రాత్రి పూట ఆ మార్గంలో వాహనాలు కూడా ఉండవు. మహిళలు, పిల్లలు ఆ దారుల్లో వెళ్లేందుకు భయాందోళనకు గురవుతుంటారు. ఇప్పటికైనా అటు టిటిడి, ఇటు వైద్యాధికారులు స్పందించి ఆ ప్రాంతంలో కనీసం మూడు మెడికల్ షాపులైన ఏర్పాటు చేసి రోగులను, వారి సహాయకుల సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



మా భార్యకోసం వస్తే నేను రోగినవుతున్నా



మాది గుంటూరు జిల్లా. మా భార్య మెకాళ్ల సమస్యలతో బాధపడుతుంటే తిరుపతి బర్డు ఆసుపత్రికి తీసుకొచ్చాను. ఇక్కడ వైద్యం కోసం చేర్పిస్తే, ఆమె వైద్యానికి అవసరమైన మందులు ఇక్కడెక్కడ లేవు. అసలు మెడికల్ షాపులే లేవు. తప్పనిసరి పరిస్థితుల్లో కిలోమీటరు దూరం పరుగెత్తుకెళ్లి మందులు కొనుక్కోవాల్సి వస్తుంది. ఆమె మందుల కోసం తిరిగి తిరిగి నాకు మోకాళ్ల నొప్పి వస్తోంది. టిటిడి అధికారులు స్పందించి రోగులకు అందుబాటులో మందుల షాపులు ఏర్పాటు చేయాలి.

-కృష్ణయ్య, గుంటూరు జిల్లా.

శ్మశాన దారిని మూసేసిన 'మెగా'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మదనపల్లి-నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణ పనుల పేరిట మెగా సంస్థ చేసిన నిర్వాహకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. రహదారి పనుల పేరిట సర్వీసు రోడ్లను ధ్వంసం చేయడం, సాగునీటి కాలువలను మూసి వేయడం, చెరువులను చెర పట్టడం చేసిన మెగా యాజమాన్యం చివరకు శ్మశానదారులను కూడా మూసి వేసింది. తొట్టంబేడు మండలం పెద్ద కన్నలి గ్రామం నుంచి శ్మశానానికి పోయే దారిలో వంతెన నిర్మించింది. దీంతో శ్మశాన దారి మూతపడింది. దారిని బాగు చేయాలని పలుసార్లు గ్రామస్తులు యాజమాన్యంకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. గురువారం గ్రామంలో ఓ టీడీపీ సీనియర్ నేత తండ్రి మరణించాడు. దీంతో ఆయన అంతిమ యాత్రకు తరలి వచ్చిన వందలాదిమంది శ్మశాన స్థలానికి వెళ్లలేక అపసోపాలు పడ్డారు. జేసీబీ సాయంతో మూసిన రోడ్డును తెరిచే ప్రయత్నం చేశారు. అయినా బురదమయం కావడంటో శవ యాత్ర కాస్త నరకయాత్రను తలపించింది. విషయం ఎమ్మెల్యే దష్టికి వెళ్లడంతో మెగా యాజమాన్యంపై సీరియస్ అయ్యినట్లు సమాచారం. వెంటనే రోడ్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారని టీడీపీ వర్గాలు తెలిపాయి.


మెగా నిర్వాకంతో శ్మశానానికి దారి లేక ఇక్కట్లు

ఈ రోడ్డు.. సొగసు చూడతరమా..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఈ చిత్రంలోని రోడ్డు దుస్థితిని చూడండి. ఎక్కడో మారుమూల పల్లెల్లోనో! లేక అభివద్ధికి ఆమడ దూరంలోనో ఉన్న గ్రామంలోనో ఉన్నది ఎంతమాత్రమూ కాదు . ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రపంచ ఖ్యాతి గడుస్తున్న శ్రీకాళహస్తి పట్టణంలోని దక్షిణ కైలాసనగర్ లోనిది. దక్షిణ కైలాస నగర్ నుంచి చెన్నై-నాయుడుపేట రింగ్ రోడ్డును అనుసంధానం చేసే ప్రధాన రోడ్డు ఇది. చిన్నపాటి వర్షం పడినా ఈ రోడ్డు బురద మయమై ప్రయాణానికి ఇబ్బందికరంగా మారుతోంది. శ్రీకాళహస్తి పట్టణంలో అభివద్ధి చెందుతున్న ప్రాంతాలలో ఎస్టిడికె నగర్ కూడా ఒకటి. ఇలాంటి ప్రాంతంలో రోడ్డు ఇంత దారుణంగా ఉన్నాయంటే పాలకులు, అధికారుల చిత్తశుద్ధి ఏపాటిదో అవగతమవుతోంది.


శ్రీకాళహస్తిలో ఇది ఒక రహదారి

కల్లాకపటం లేనిది.. బాల్యదశ

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: బాల్య దశ కపటం లేనిదని బుచ్చినాయుడు కండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమణయ్య అన్నారు. పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

గూడూరు టౌన్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవాన్ని జరుపుకున్నారు. క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు 100 ఇయర్స్ స్టూడెంట్ అసోసియేషన్ వారు 35 వేల రూపాయల విలువ చేసే బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సనత్ కుమార్, హెచ్‌ఎం భారతి, అసోసియేషన్ సభ్యులు ఆడిటర్ రామ్మోహన్ రావు, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా మండలంలోని చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి, మాజీ వైస్ ఎంపిపి మట్టం శ్రావణి రెడ్డి పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు.

పట్టణంలోని మినీ గురుకులంలో జాతీయ బాలల దినోత్సవంను పురస్కరించుకొని విద్యార్థులకు క్రీడా పోటీలు, సాంస్కృతిక నిర్వహించారు. మాజీ శ్యామ్ యాదవ్ తన తల్లి బండి వనమ్మ జ్ఞాపకార్థం క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. రోటరీ క్లబ్ సభ్యులు వెంకటేశ్వర రెడ్డి, దశరథరామి రెడ్డి, ఎన్వీ రత్నం, రవి కుమార్, జిజి నాయుడు, రాం ప్రసాద్, బాల రామి రెడ్డి, హెచ్‌ఎం మేరి ప్రియతి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: విద్యతోనే భవితకు బంగారు బాట అని టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కాపిరెడ్డి నాదముని రెడ్డి అన్నారు. మండలంలోని అన్నస్వామిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సునీత గౌడ్, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో గురువారం బాలల దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆషా సంస్థ సూపర్వైజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.


నేటి బాలలే రేపటి పౌరులని మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిని జయలక్ష్మి అన్నారు. గురువారం బాలల దినోత్సవాన్ని రేణిగుంట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో హెచ్‌ఎం విష్ణువర్ధనీ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: బాలలు భావిభారత నిర్మాతలని ఏర్పేడు మండలం పాతవీరాపురం ఎంపిపి స్కూల్ హెచ్‌ఎం భువనేశ్వరి అన్నారు. రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ సౌజన్యంతో జవహర్లాల్ నెహ్రూ జయంతి పురస్కరించుకుని బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, డాక్టర్ దేవరాజులు, వెంకటేశ్వర్లు, ఉషారాణి, సూర్యనారాయణ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఓబులాయిపల్లి, బివి పురం పంచాయతీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రగతి సంస్థ, పాఠశాల ఉపాధ్యాయులు సంయుక్తంగా జాతీయ బాలల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ కోఆర్డినేటర్ ప్రభాకర్ విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సాదిక్ బాషా, ఉపాధ్యాయులు, ప్రగతి సంస్థ శ్రీరామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: బాలల దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ పిచ్చాటూరు ప్రాజెక్ట్ నారాయణవనం మండలంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాలల్లో బాల్యవివాహాల గురించి, వ్యక్తిగత పరిశుభ్రత గురించి గుడ్ టచ్ బాడ్ టచ్ మొదలగు విషయాల గురించి బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ బేబీ, హెచ్‌ఎం శశికళ, శ్యామలత, భారతి, అంగన్వాడీ కార్యకర్తలు వాణి, నాగభూషణం, పద్మావతి పాల్గొన్నారు.


శ్రీకాళహస్తి రూరల్‌లో


గూడూరులో


పుత్తూరులో

నేటి చదువే.. రేపటి ఆస్తి

- ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక బైరాగి పట్టెడలోని డాక్టర్ డి రామానాయుడు మున్సిపల్ ప్రైమరీ స్కూల్లో ఘనంగా బాలల దినోత్సవం సంబరాలు జరిగాయి. ముఖ్య అతిథిగా ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ హాజరయ్యారు. విద్యా ప్రాముఖ్యతను పిల్లలకు వివరించారు. బుధవారం నిర్వహించిన ఆటపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతు ప్రదానం చేశారు. హెచ్‌ఎంలు భానుమతి, కదిరి రవి, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విస్డం క్లబ్ తిరుపతి అధ్యక్షులు, ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ప్రెసిడెంట్ తహ సున్నీసా బేగం, డాక్టర్ రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.



పూతదశలోనే సస్యరక్షణ చేపట్టాలి

- మండల ఉద్యానశాఖ అధికారి శివకుమారి



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ప్రస్తుతం మామిడి తోటల్లో అక్కడక్కడ పూత తొడుగుతోంది. పూతతొడిగే దశనుంచే సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఉద్యానశాఖాధికారి శివకుమారి రైతులకు సూచించారు. గురువారం గోటూరువాండ్లపల్లి, అరికెలవారిపల్లి, భాకరాపేట మామిడి రైతులు కిషోర్ కుమార్ రెడ్డి, అరికెల రామకృష్ణారెడ్డి, చెంగల్రాయులు తదితర రైతుల మామిడి తోటలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం పూతకు వచ్చిన తోటల్లో తేనె మంచు పురుగులు, పూత గూడు పురుగులు, పక్షి కన్ను తెగులు ఉధృతి పెరుగుతుందన్నారు. దీని నివారణకు అసిఫేట్ 0.5 గ్రాములు, టెబ్లూ బెంజురాన్ 0.5 మిల్లీ గ్రా.లు, కార్బండాజిమ్ 1 గ్రాము లీటర్ నీటికి జిగురుకలిపి పిచికారి చేయాలన్నారు. ఇంకా పూత రాని తోటల్లో పూత రావడానికి 13-0-45 (మల్టీకే)-10 గ్రాములు, బోరాన్ 1 గ్రాము యూరియా 5గ్రాములు లీటర్ నీటి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. మందులు పిచికారి చేసేటప్పుడు చెట్టు మొత్తం తడిచే విధంగా పిచికారి చేయాల్సి ఉంటుందన్నారు. పూత బాగా విచ్చుకున్నప్పుడు ఎలాంటి మందులు వాడరాదని సూచించారు. తోటలో ఎలాంటి కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం మండలంలో తుపాను వల్ల వర్షం పడుతుండడంతో వర్షం తగ్గిన తర్వాత చూసుకొని మందులు పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఏదైనా సూచనలు సలహాల కోసం కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

అనుమతులు ఉండాల్సిందే..

- అక్రమంగా కేబుల్స్ అమర్చితే కఠిన చర్యలు
- ప్రైవేటు ఆపరేటర్లకు ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ హెచ్చరిక
- చంద్రగిరి డివిజన్ కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి-రామచంద్రాపురం (చంద్రగిరి): అనుమతులు లేకుండా విద్యుత్ స్తంభాలకు కేబుల్స్ అమర్చితే కఠిన చర్యలు తప్పవని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర నాయుడు హెచ్చరించారు. గురువారం చంద్రగిరి సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ స్టేషన్ నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఉర్జా వీర్ గురించి ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్‌కు అవగాహన కల్పించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్‌ను ఎలా ఆదా చేసుకోవచ్చు వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ప్రతి అధికారి బాధ్యతగా, అవగాహనతో మెలగాలని సూచించారు.


సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ

అనంతరం ప్రైవేట్ కేబుల్ ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుమతులు తీసుకోకుండా విద్యుత్ స్తంభాలకు ఫైబర్ వైర్లను కట్టి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఈ వాసు రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషాద్రి రెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నాగరాజు, వెంకటరమణ, నీలకంఠయ్య, సబ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అసంక్రమణ వ్యాధులపై సర్వే

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అసంక్రమణ వ్యాధులను నిర్ధారించడానికి అధికారులు ఇంటింటి సర్వే ప్రారంభించారు. కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షులు సుధాకర్ నాయుడు, ఎంపీడీవో త్రివిక్రమ రావు హాజరైయ్యారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశులు, సూపర్వైజర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పోసానిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: టీవీ5 మీడియా అధినేత, టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడుని అసభ్య పదజాలంతో కించపరుస్తూ మాట్లాడిన సినీ కథ రచయిత పోసాని క్రిష్ణమురళిపై కఠిన చర్యలు తీసుకోవాలని పుత్తూరు పోలీస్‌స్టేషన్‌లో టీవీ5 రిపోర్టర్ అభి ఫిర్యాదు చేశారు. సామాజిక సేవా దృక్పథంతో పనిచేస్తున్న వ్యక్తిని టార్గెట్ చేస్తూ పోసాని సామాజిక మాధ్యమాలలో జుగుప్సాకరంగా వ్యాఖ్యలు చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

వెంకటరమణకు నివాళి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: వైసీపీ సీనియర్ నాయకుడు తిరుమల శెట్టి వెంకటరమణ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసీపీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నూకతోటి రాజేష్ మండలంలోని కాటూరు గ్రామానికి చేరుకున్నారు. వెంకటరమణ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాజేష్ వెంట ఏఎంసీ ఛైర్మన్ గురవయ్య, మణినాయుడు, ఎంపీటీసీ రవి, నాయకులు ఉన్నారు.

విత్తనాలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న వేరుశనగ విత్తనకాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తడుకు సర్పంచ్ బొబ్బిలి వెంకటేష్ అన్నారు. గురువారం తడుకు రైతు సేవా కేంద్రంలో వేరుశనగ విత్తన కాయల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఆదిమందడి, అమరనాథ్ రాజు, భాస్కర్ శెట్టి, పంచాయతీ కార్యదర్శి నరేష్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ తరుణ్ పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈగా గోపినాథ్

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల గృహ నిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్‌గా కిన్నెర గోపి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఏఈ సుబ్రమణ్యం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో కిన్నెర గోపినాథ్‌ను ఉన్నతాధికారులు ఏఈగా నియమించారు. ఈయన గతంలో గాజులపెళ్లూరు సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేశారు.

కూలిన చెట్టు.. ఆగిన ట్రాఫిక్



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కంచన పుత్తూరు సమీపంలో వర్షాలకు చెట్టు రోడ్డుపై కూలిపోయింది. ప్రధాన రహదారి కావడంతో భారీగా వాహనాలు రోడ్డుపై నిలిచి పోయాయి. దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కి అంతరాయం కలిగింది. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. స్పందించిన అధికారులు వెంటనే చెట్టును తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

విద్యార్థికి చేయూత

ప్రజాశక్తి-కోట: కళాశాల ఫీజు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విద్యార్థికి దాత చేయూతనిచ్చారు. మండలంలోని శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వాహకులు అల్లం రమణయ్య చేతులమీదగా గురువారం కరుణ అనే విద్యార్థికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. రమణయ్యకు విద్యార్థి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జ్ఞానబడులు.. గ్రంథాలయాలు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ప్రొఫెసర్ డాక్టర్ సురేంద్ర బాబు అన్నారు. గురువారం తిరుపతి గోవిందరాజస్వామి దక్షిణ మాడ వీధిలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ డాక్టర్ సురేంద్ర బాబు జ్యోతి ప్రజ్వలన చేసి, నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాధమ్మ, భారతి, ప్రతాప్ రెడ్డి, మనిగందన్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: నెహ్రూ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి బాలసుబ్రమణ్యం తెలిపారు. గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పుత్తూరు గ్రంథాలయంలో ప్రారంభించారు. జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.


తిరుపతిలో

తిరుపతి డెస్క్: నారాయణవనం మండల కేంద్రంలోని 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలశాఖ అధికారి జీవన్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, జీవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

18న సచివాలయాల వద్ద ఆందోళనలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: పేదల ఇళ్ల నిర్మాణాలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం, రూ.5లక్షలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఈబీసీ కాలనీలో సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య కరపత్రాలను విడుదల చేశారు. ఇళ్ల నిర్మాణాలకు పేదల పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వ మూడు సెంట్లు స్థలం, రూ.5లక్షలు మంజూరు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో 18న అన్ని గ్రామ సచివాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చంద్రమ్మ, రాజేశ్వరి, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, రంగమ్మ, వెనిల తదితరులు పాల్గొన్నారు.

అధినేతను కలిసిన వైసీపీ నాయకులు

ప్రజాశక్తి-పెళ్లకూరు: వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మండలానికి చెందిన పలువురు నాయకులు గురువారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ సీఎంను కలిసిన వారిలో మాజీ డిసిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మోహన్, ఆనంద్, దయ కృష్ణలు ఉన్నారు.




సరిహద్దులో ఎస్పి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-తడ: అంతర్రాష్ట్ర సరిహద్దు బివిపాలెంలో తిరుపతి ఎస్పి సుబ్బారాయుడు గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సరిహద్దులో పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని అక్కడి పోలీసులను ఆదేశించారు. సీసీ కెమెరాల పనితీరు, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై ఆరాదీశారు. అనుక్షణం అప్రమత్తం గా ఉండాలని అధికారులకు సూచించారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొడప్ప నాయుడు పాల్గొన్నారు.


సిబ్బందితో ఆరాదీస్తున్న ఎస్పీ సుబ్బారాయుడు

నెహ్రూ జయంతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక పీపుల్స్ నర్సింగ్ హోంలో గురువారం దేశ మొదటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ జయంతిని నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. నవ భారత ప్రభుత్వ విధానాలకు రాజకీయ సంస్కృతినద్ది శక్తివంతమైన విదేశాంగ విధానాన్ని రూపొందించడంలో నెహ్రూ ముఖ్యపాత్ర పోషించారని పీసీసీ కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు అన్నారు. గోపి, వీర రాఘవరెడ్డి, రమణయ్య, నాగూర్, శివయ్య, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహనతో క్యాన్సర్ వ్యాధిని అరికట్టొచ్చు: కలెక్టర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: క్యాన్సర్ నివారణ చర్యల్లో భాగంగా ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్పీలు క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే నిర్వహించి అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి సరైన చికిత్స, ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం స్థానిక వరదయ్యపాలెం మత్తెరిమిట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే కార్యక్రమంలో డిఎంహెచ్ఓతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే జరుగుతోందని, ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకొని, ముందు జాగ్రత్త చర్యలు పాటించడం ద్వారా క్యాన్సర్ వ్యాధి నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్‌డివో కిరణ్మయి, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ శ్రీహరి, అదనపు జిల్లా వైద్య శాఖదికారి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌సిడి వైద్యురాలు డాక్టర్ పద్మావతి, సర్పంచ్ హరి, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు మాస్ మీడియా అధికారి బాబు నెహ్రూరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బాసట


విద్యుత్ దీపాలను అందిస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పలువురు విద్యార్థులకు బాసటగా నిలిచారు. జనసేన నియోజవర్గ ఇన్‌ఛార్జ్ కోటా వినుత ఆధ్వర్యంలో పట్టణంలోని గిరిజన సంక్షేమ పాఠశాలకు అవసరమైన వీధి దీపాలను వితరణగా ఇచ్చారు. అదేవిధంగా తొట్టంబేడు మండలంలోని గుండేలిగుంట ఉన్నత పాఠశాల విద్యార్థులకు రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.18వేలు విలువైన కలర్ ప్రింటర్‌ను వితరణగా అందించారు. చెంచు రెడ్డి, మహేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు చెంచయ్య, మునీశ్వర్ పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- ప్రమాదంలో తల్లీకూతుళ్లు మృతి
- మరో ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు
- శుభవేళ.. కుటుంబాలలో విషాదం

ప్రజాశక్తి-రామచంద్రాపురం(తిరుపతి రూరల్): తిరుపతి రూరల్ మండలం పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి వేదాంతపురం వద్ద(ఆర్‌సి పురం జంక్షన్) గురువారం తెల్లవారుజామున కారును ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో తల్లి కూతుళ్లు సావిత్రి(80), సంగీత(38) మృతి చెందగా. మరో ఇద్దరు లక్ష్మీదేవి, జ్యోతిలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎంఆర్‌పల్లి సీఐ చిన్న గోవిందు కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మి నగర్ క్షత్రియ ఎన్ క్లావే అపార్ట్మెంట్‌లో ప్లాట్ నంబర్ 101లో నివాసం ఉంటున్న రాజశేఖర్ రాజు వేదాంతపురం పంచాయతీ ఎంజి బ్రదర్స్ లేవవుట్‌లో నూతనంగా నిర్మించిన గృహప్రవేశానికి హాజరయ్యేందుకు రాజశేఖర్ తల్లి సావిత్రి(80), చెల్లెలు, అక్కలు ధనలక్ష్మి నగర్ క్షత్రియ అపార్ట్మెంట్ నుంచి ఉదయం 3గంటలకు బయలు దేరి ఆర్‌సి పురం క్రాస్ వద్ద హైవేపై రోడ్డు దాటుతుండగా నల్గొండ నుంచి బెంగళూరు వైపు వెళుతున్న ట్రావెల్ బస్సు డ్రైవర్ సురేష్ అతి వేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడిపి రోడ్డు దాటుచున్న కారును ఢీ కొట్టి కొంత దూరం ఈడ్చి కెళ్ళింది.. ప్రమాదంలో క్షతగాత్రులను ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పుల్లంపేట మండలం రంగంపల్లికి చెందిన సావిత్రి (80), ఒంటిమిట్ట రాచపల్లికి చెందిన చెల్లెలు సంగీత(38) మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మరో ఇద్దరు చెల్లెల్లు జ్యోతి, లక్ష్మీదేవిలకు తీవ్ర గాయాలతో మెరుగైన వైద్యం పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కన్న కొడుకు రాజశేఖర్ రాజు కట్టిన ఇంటి గృహప్రవేశానికి వెళుతూ తిరిగిరాని లోకాలకు అమ్మ సావిత్రి, చెల్లెలు సంగీత వెళ్లారని కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు, మున్నీరై శోకసముద్రంలో మునిగి తేలుతున్నారు.

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తండ్రి మందలించాడని కొడుకు పురుగుల మందు తాగి తనువు చాలించిన విషాదకర ఘటన గురువారం తొట్టంబేడు మండలంలోని నెల్లిమానుకండ్రిగ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. నెల్లిమానుకండ్రిగ గ్రామానికి చెందిన శివయ్య కుమారుడు నాగులు(17) శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేటు దుకాణంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం ఏ కారణం చేతనో కొడుకు షాపుకు వెళ్లకపోతే తండ్రి శివయ్య మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన నాగులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. బంధువులు గుర్తించి చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. నాగులు రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై తొట్టంబేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి - శ్రీనివాస మంగాపురం రోడ్డు స్వర్ణముఖి బ్రిడ్జి క్రింద శ్మశానం వద్ద ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి చనిపోయి ఉండటాన్ని గురువారం చంద్రగిరి పోలీసులు గుర్తించారు. మృతుని వయస్సు సుమారు 45 నుండి 50 సం.లు ఉంటుందని, ఉదయం నుంచి అక్కడే ఉన్నట్లు శ్మశానికి వెళ్లిన వారు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. అనారోగ్యం కారణంగా కానీ, ఎక్కువగా మద్యంతాగి నందు వలన కానీ లేదా మరే ఇతర కారణం వల్ల గాని చనిపోయి ఉండవచ్చని పోలీసుల భావిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు సిఐ సెల్ నెంబర్ 94407 96760, ఎస్ఐ సెల్ 63050 14261 సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల

శ్రీవారి అన్నప్రసాదాలు స్వీకరిస్తుంటే ఆత్మ సంతప్తి కలుగుతుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో మంత్రి కొల్లు రవీంద్ర, సినీ జాతీయ గాయకుడు విజయ ప్రకాష్, కర్నాటక శంగేరీ శారదాపీఠం పీఠాధిపతి విధుశేఖర స్వామిజీ లు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ మహాద్వారం వద్ద విధుశేఖర స్వామిజీకి చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలకగా మంత్రి కొల్లు రవీంద్ర, గాయకుడు విజయ ప్రకాష్ కు టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేరు వేరుగా గర్భాలయంలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గత వైసిపీ పాలనలో తిరుమలలో చాలా అపచారాలు జరిగాయని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరుమలలో పవిత్రత పునరుద్ధరణ జరుగుతుందని, రాష్ట్రంలో యువత ఉద్యోగావకాశాలు కలగాలని శ్రీవారిని ప్రార్ధించానన్నారు.

తిరుపతిలో కార్తీక మహా దీపోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనం పరేడ్ మైదానంలో నవంబరు 18వ తేదీ రాత్రి నిర్వహించనున్న కార్తీక మహాదీపోత్సవానికి టిటిడి విస్తతంగా ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో భాగంగా మహిళలు కూర్చుని దీపాలు వెలిగించేలా దీపపు దిమ్మెలు, నేతి ఒత్తులు ఏర్పాటు చేస్తున్నారు. మైదానం మొత్తం తివాచీలు, ఒక్కో దీపపు దిమ్మె వద్ద తులసి మొక్కను ఉంచనున్నారు. కార్యక్రమం అనంతరం మహిళలకు ఈ మొక్కలను అందిస్తారు. వేదికను శోభాయమానంగా పుష్పాలతో, విద్యుత్ దీపాలు, వేదిక ఇరువైపులా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సెట్టింగ్ లు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న శ్రీ మహాలక్ష్మీపూజకు ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. టిటిడి పరిపాలనా భవనం ప్రధాన ద్వారాల నుంచి ఆవరణం మొత్తం అరటి చెట్లు, పూలు, విద్యుద్దీపాలతో అలంకరించనున్నారు. ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మైదానంలో బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తారు.

భూ ఆక్రమదారునిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి గ్రామీణ మండలం పేరూరు గ్రామ లెక్క దాఖలాలోని సర్వే నెంబర్ 197/1 పాతకాల్వ వద్దనున్న తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితురాలు పద్మజ విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆమె మాట్లాడారు. తన భర్త మాజీ సైనికుడని, తన రిటైర్మెంట్ ధనంతో 2018 వ సంవత్సరంలో సదరు సర్వే నంబర్లు 63 సెంట్ల భూమిని కొనుగోలు చేశామన్నారు. పాత కాల్వకు చెందిన కల్పన అనే మహిళ తమ స్థలాన్ని ఆక్రమించుకొని ప్రహరీ గోడను నిర్మించింది అన్నారు. తమదే కాకుండా మరో 14 మందికి చెందిన భూమిని కూడా ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ దురాక్రమణలను ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ప్రకాష్, హేమంత్ ఆచారి, రాజేశ్వరి పాల్గొన్నారు.

'మంగళం ట్రెండ్స్‌లో' ఎన్ఎక్స్ ఫ్లోర్ డిజిటల్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



మంగళం పరిధిలోని పీఎం శ్రీ మంగళం ట్రెండ్స్ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, చదువు పట్ల విద్యార్థులు ఇష్టంగా చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధి విజయసారథి పాఠశాలలో విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉండే ఎన్ఎక్స్ ఫ్లోర్ డిజిటల్ ల్యాబ్ ను ప్రారంభించారు. ఇందులో స్మార్ట్ టీవీ, ఇన్వర్టర్, ల్యాప్టాప్, డిజిటల్ సామాగ్రిని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేసినందుకు స్మైల్ ఫౌండేషన్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ బేస్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని హరిప్రియను డివైఈవోలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీలు రామకష్ణ, సాంబశివరావు, కష్ణమ నాయుడు, దుర్గాబాయి, గిరి, లక్ష్మీకాంతమ్మ, పాల్గొన్నారు.

భారతదేశానికి మరో వంద శ్రీసిటీలు కావాలి

నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రమణ్యం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం



అన్ని వసతులతో కూడిన విశాల స్థలం, వ్యాపార అనుకూల వాతావరణం కలిగిన శ్రీసిటీ లాంటివి భారతదేశానికి మరో వంద కావాలంటూ నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం అభిప్రాయపడ్డారు. బుధవారం సాయంత్రం ఆయన శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలు, పారిశ్రామిక వద్ధి సామర్థ్యాన్ని ఆయనకు వివరించారు. పరిశ్రమల సీఈఓల సమావేశంలో సుబ్రమణ్యం మాట్లాడుతూ భారతదేశం అన్నివిధాలా వేగంగా దూసుకెళుతున్న తరుణంలో పరిశ్రమల వద్ధి, స్థాపనకు అత్యంత అనువైనదంటూ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. దేశంలో అత్యధిక జనాభా, యువత అందుబాటులో ఉందన్న ఆయన వారిని శ్రామికశక్తిగా మార్చుకోవాల్సిన భాధ్యత మన అందరదని పేర్కొన్నారు. శ్రీసిటీ విజయాలు, ప్రత్యేకతలను ప్రశంసించారు. సహజసిద్ధమైన పర్యావరణ వ్యవస్థతో 30 దేశాలకు చెందిన 220 విభిన్న పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీసిటీ, భారతదేశంలోని ప్రధాన పారిశ్రామిక కేంద్రాలలో ఒకటిగా పేర్కొన్నారు. ముఖ్యంగా ఇక్కడ నీటి సంరక్షణ పద్దతులను కొనియాడుతూ, వరదలను నివారించేలా తీర్చిదిద్దబడిన నీటి గుంటలు, రిజర్వాయర్లు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. పరిశ్రమలకు సమీపంలో కార్మికులకు నివాస గహ సౌకర్యాలకు సంబంధించిన సమస్యలను పరిశ్రమల ప్రతినిధులు లేవనెత్తారు. ఇందుకు సుబ్రమణ్యం సానుకూలంగా స్పందిస్తూ వీటిని కీలకంగా గుర్తిస్తూ విధాన నిర్ణయాల్లో ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు.

రాత్రుల్లో చెత్త తొలగింపు ప్రత్యేక డ్రైవ్ : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర రద్దీ ప్రాంతాల్లో రాత్రిపూట చెత్త తొలగింపు ప్రత్యేక డ్రైవ్‌గా చేపట్టినట్లు కమిషనర్ ఎన్.మౌర్య చెప్పారు. ఆమె ఛాంబర్‌లో విలేకరులతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ర్యాంకు కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. తిరుపతిలోని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, లాడ్జీలు, వ్యాపార సముదాయాలు అధికంగా ఉండటం వల్ల చెత్తాచెదారం ఓ పద్ధతి ప్రకారం తీసుకోడానికి ఉదయం పూట ట్రాఫిక్ ఉండటం వల్ల రాత్రిపూట సేకరించి రామాపురం కంపోస్టు యార్డ్‌కు తరలిస్తామన్నారు. చెత్తను కాల్వల్లో వేస్తే కఠిన చర్యలు తీసుకుని, జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. దీనికి సంబంధించి సిబ్బందిని ప్రత్యేకంగా నియమిస్తామన్నారు. రోడ్లు ఊడ్చడానికి స్వచ్ఛంద కార్పొరేషన్‌లో స్వైపింగ్ వాహనాలు కొనుగోలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రత్యేక యాప్ ద్వారా పొదుపు సంఘాల విక్రయాలు చేపడుతున్నామన్నారు. టిడిఆర్ బాండ్లు పంపిణీ ప్రభుత్వ నిబంధన మేరకే ఇస్తామన్నారు.


తిరుపతి స్మార్ట్ సిటీ పథకంలో 45 కోట్లతో రైల్వే స్టేషన్ ఎదురుగా మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ పనులు చేపట్టారని, అక్కడ కార్ పార్కింగ్ కొన్ని అంతస్తులు కేటాయించి మిగిలిన అంత వాణిజ్య సముదాయం ఏర్పాటు చేసి కార్పొరేషన్ ఆదాయం పెంచుకోవడంపై పరిశీలన చేస్తున్నట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ వల్ల ఆదరణ అక్కడ తక్కువ ఉందని గుర్తు చేశారు. ఈస్ట్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ గెస్ట్ హౌస్ వద్ద అక్కడ కూడా వాణిజ్య సముదాయ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు.

ఏం కష్టమొచ్చిందో..!

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

విద్యార్థిసంఘాల నిరసన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



ఏ కష్టమొచ్చిందో తెలియదు ..చదువులోనూ, క్రీడలలోనూ, క్విజ్ పోటీలలోనూ ప్రతిభ చూపుతూ అధ్యాపకుల దష్టిలో మంచి గుర్తింపు తెచ్చుకుంది.. ఇంతటి ప్రతిభగల విద్యార్థిని అనిత (19) కళాశాల హాస్టల్లో విగతజీవిగా పడి ఉండటం చూసి హాస్టల్ సిబ్బంది, తోటి విద్యార్థులు బోరున విలపిస్తున్నారు. వివరాలలోకి వెళితే.. అన్నమయ్య జిల్లా గుర్రంకొండకు చెందిన ఓ విద్యార్థిని పద్మావతి డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బయోకెమిస్ట్రీ రెండవ సంవత్సరం చదువుతోంది. గురువారం ఉదయం అందరితో చలాకీగా గడిపింది. తోటి విద్యార్థులు హాస్టల్ రూమ్ నుంచి తరగతి గదులకు వెళ్లిన సమయంలో ఒంటరిగా హాస్టల్ లో ఉన్న ఆ విద్యార్థిని ఫ్యాన్ కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని తనువు చాలించింది. వెంటనే గుర్తించిన హాస్టల్ సిబ్బంది ఆమెను పరీక్షించగా అప్పటికే మరణించినట్లు దవీకరించి కళాశాల అధికారులకు సమాచారం అందించారు. కళాశాల విజిలెన్స్ సిబ్బంది యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్య కారణాలు వెల్లడించాలని విద్యార్థిసంఘాల నాయకులు కళాశాల ఎదుట గురువారం సాయంత్రం నిరసన తెలిపారు.

కారణాలు తెలియాల్సి ఉంది : డాక్టర్ టి.నారాయణమ్మ, ప్రిన్సిపాల్, ఎస్పిడబ్ల్యు

డిగ్రీ రెండవ ఏడాది చదువుతున్న విద్యార్థిని కళాశాలలో అన్ని రంగాలలోనూ మెరిట్ స్టూడెంట్. కానీ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం. ఆత్మహత్యకు గల కారణాలు స్పష్టంగా తెలియాల్సి ఉంది. కానీ తోటి విద్యార్థుల సమాచారం మేరకు తమ సొంత ఊరిలో ఓ యువకుడు బుధవారం చనిపోయాడని తెలిసి కలతచెంది..ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో వివరాలు తెలుస్తాయి.

2025, మార్చికల్లా దేశమంతా స్మార్ట్ మీటర్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



వచ్చే ఏడాది మార్చికల్లా దేశమంతటా విద్యుత్ స్మార్ట్ మీటర్లు వినియోగంలోకి వస్తాయని శ్రీకాళహస్తి విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి. సుధాకర్ తెలిపారు. స్థానిక ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద లైన్ మెన్లకు గురువారం స్మార్ట్ మీటర్లపై అవగాహన కల్పించారు. విద్యుత్ బిల్లుల భారం తగ్గింపు, సరైన విద్యుత్ డేటా ను అందజేసేందుకు స్మార్ట్ మీటర్లు ఉపయోగపడుతాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకే స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు.

మార్కెట్లోకి న్యూ డిజైర్ కారు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

మారుతి సుజుకి సంస్థ నూతనంగా రూపొందించిన ఫోర్త్ జనరేషన్ న్యూ డిజైర్ కారును భార్గవి ఆటోమొబైల్స్ ఆధ్వర్యంలో గురువారం మార్కెట్లోకి విడుదల చేశారు. స్థానిక రేణిగుంట రోడ్ లోని మారుతి సుజుకి షోరూం వద్ద జరిగిన కార్యక్రమానికి జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ డాక్టర్ బి కష్ణవేణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కొత్త డిజైర్ యువతరానికి నచ్చేలా సరికొత్త డిజైన్లతో అత్యాధునిక మారుతి కారును మార్కెట్లోకి విడుదల చేశామన్నారు. ఇందులో సిక్స్ ఎయిర్ బ్యాగ్స్ ఉండటం వల్ల సేఫ్టీ మెరుగైందన్నారు. ఎలక్ట్రిక్ సన్ రూఫ్, ఎల్ ఈడి క్రిస్టల్ విజన్ హెడ్లాంప్స్, 360 హెచ్ డి వ్యూ కెమెరా, వైర్లెస్ చార్జర్, ఈ కొత్త వాహనం సరికొత్త కెఎంపిఎల్ అందిస్తుందన్నారు. ఈ కారు ఏడు రంగుల్లో లభ్యం అవుతుందన్నారు. దీన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భార్గవి ఆటో మొబైల్ ఎండి కొండా నిరంజన్ రెడ్డి, ఈవో కొండా ఈశ్వర్ రెడ్డి, దీపక్, జిఎం రమేష్ పాల్గొన్నారు.



25 నుంచి 108 సేవలు బంద్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రోడ్డు ప్రమాదాల్లో, వివిద రకాల ఆపదల్లో ఉన్న ప్రజల ప్రాణాలు కాపాడే తమ సమస్యలను పరిష్కరించాలని 108 రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పురుడుపోసుకొని ప్రారంభం అయిన 108 అత్యవసర సేవ నేడు అదే రాష్ట్రంలో చతికల పడ్డాయన్నారు. ప్రజలకు ఎంతో కీలకమైన సేవ అయిన 108 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ఇప్పటికే కూటమి ప్రభుత్వానికి పలు దఫాలుగా వినతులు ఇచ్చామన్నారు. అయినా పట్టించుకోలేదన్నారు. గతంలో 2011లో ఇలానే 108 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అప్పటి ప్రభుత్వానికి వినతి ఇచ్చినా పట్టించుకోకపోవడంతో అప్పట్లో దాదాపుగా వెయ్యి మంది సరైన వైద్య సేవలు అందక చనిపోయారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే 108ని నడిపేలా అనుభవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచన చేసి ప్రజాధనాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కరోనా సమయంలోనూ ఎంతో ధైర్యసాహసాలతో ప్రజలకు వైద్య సేవలను అందించామన్నారు. ఇప్పటికైనా 108 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం చర్చించి తగు సమంజస నిర్ణయాన్ని తీసుకోవాలని కోరారు ఈ విలేకరుల సమావేశంలో 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు మహేష్, కార్యదర్శి మునిరాజ, రాజేష్, సునీల్, కేశవులు, సుధాకర్ పాల్గొన్నారు.

తిరుపతిలో డురియన్ లగ్జరీ ఫర్నిచర్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



డురియన్ లగ్జరీ ఫర్నిచర్ తిరుపతిలోని తన మొట్టమొదటి షోరూంను గురువారం ప్రారంభించింది. స్థానిక ఆర్ సి రోడ్డులోని ఆ సంస్థ నూతన షోరూం ప్రారంభం సందర్భంగా పిఆర్వో మహేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ఇళ్లకు విలాసవంతమైన ఫర్నిచర్‌ను చేరువ చేసే ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని ఇది సూచిస్తుంది. 40 సంవత్సరాలకు పైగా విస్తరించిన వారసత్వంతో, అధిక-నాణ్యత, ఆకర్షణీయమైన, మన్నికైన ఫర్నిచర్‌ను అందించడంలో విశ్వసనీయ సంస్థగా డురియన్ ఫర్నిచర్ మారిందన్నారు. ఇది సొగసైన , ఆధునిక సమకాలీన పీస్ ల నుండి కాలాతీత క్లాసిక్ స్టైల్ వరకు విభిన్న డిజైన్ ప్రాధాన్యతలను అందిస్తుంది. తిరుపతి స్టోర్ ఈ వారసత్వానికి ప్రతిబింబం, విలాసవంతమైన సోఫాలు, రెక్లైనర్లు, బెడ్స్ , డైనింగ్ టేబుల్‌లు, కాఫీ టేబుళ్ల మరిన్నింటిని అందజేస్తుంది. ప్రతి ఒక్కరి అభిరుచి, శైలికి అనుగుణంగా రూపొందించబడిందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.